
సాక్షి
పల్నాడు
శనివారం । 22 । మార్చి । 2025



విజిలెన్స్ తనిఖీలు

బాపట్ల టౌన్: బాపట్ల పట్టణంలోని పలు దుకాణాల్లో శుక్రవారం రాత్రి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఐ ఆది నారాయణ పాల్గొన్నారు.



సాగర్ నీటి మట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శుక్రవారం 519.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముగిసిన విద్యుత్ శాఖ క్రీడా పోటీలు

గుంటూరు వెస్ట్ : గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
నరసరావుపేట	6.26	4.56
గుంటూరు	6.24	4.54
బాపట్ల	6.24	4.55

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పది పరీక్షలు

- జిల్లాలో 99శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన అధికారులు

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. 128 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 25,346 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 25,111 మంది హాజరయ్యారు. సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూరవిద్య పదవ తరగతి తెలుగు, ఉర్దూ పరీక్షకు జిల్లాలోని 27 పరీక్ష కేంద్రాల్లో 1,151మందికి గాను 1,013మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన 13 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 75 కేంద్రాలను తనిఖీ చేశాయి. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురజాల, రెంటచింతలలోని నాలుగు కేంద్రాలు, జిల్లా పరీక్షల పరిశీలకులు ఎన్.గీత చిలకలూరిపేటలోని 11 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. జిల్లా పరిధిలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ చంద్రకళ తెలిపారు.

పరీక్షల డ్యూటీ నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల తొలగింపు

గురజాల : పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం డీఈవో చంద్రకళ తనిఖీ చేశారు. గురజాలలోని నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో రెండు రోజులు కిందట జరిగిన హిందీ పరీక్షలో ఒక ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు బిట్లు అందించారని పలు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో డీఈవో కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పల్లెగుంతలోని మోడల్ పాఠశాలలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. ఆరోపణలు వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయులను పరీక్షల డ్యూటీ నుంచి తొలగించినట్లు ఆమె చెప్పారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

జిల్లా ఖజానా అధికారి శ్రీనివాసరావు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులంతా లైఫ్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా అందజేయాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దాదాపు 96 శాతం అందించారని, మిగిలిన వారు కూడా వెంటనే జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రం సమర్పించే సమయంలో సమస్యలు తలెత్తినా, వృద్ధాప్యం, అనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉన్నవారు సంబంధిత ఖజానా కార్యాలయ సిబ్బంది సహాయంతో మాన్యువల్‌గా సమర్పించవచ్చని ఆయన తెలిపారు. వివరాలకు ఖజానా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

27న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. ఈనెల 27న సెలవు దినంగా ప్రకటిస్తే మరుసటి రోజున అదే వేదికల వద్ద యథావిధిగా నిధి ఆప్ కే నికత్ జరుగుతుందని పేర్కొన్నారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులంతా కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతోపాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని ఈఎస్ఐసీ డీసీబీవో, కృష్ణా జిల్లా చిన్న అవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్, ప్రకాశం జిల్లా అద్దంకిలోని ఎన్టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాల, ఎన్టీఆర్ జిల్లా పామర్రు మండలం కురుమద్దాలిలోని రాణి ఆక్వా, బాపట్లలోని పాలిటెక్నిక్ కళాశాల, పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని వసంత ఇండస్ట్రీస్‌లో నిధి ఆప్‌కే నికత్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

బతుకు భారంగుండె..!

- పెయింటర్ల ఆవేదన
- ఆధునిక పద్ధతులతో ఉపాధికి గండి
- వృత్తికి స్వస్తి పలుకుతున్న కార్మికులు
- ఇతర ఉపాధి మార్గాలపై దృష్టి

పట్నంబజారు: రంగుల హరివిల్లును అందంగా ఆవిష్కరించే కళాకారులు వారు.. అందమైన బొమ్మలను సుమనోహరంగా తీర్చిదిద్దే అపరబ్రహ్మలు పెయింటర్లు. ఏ శుభకార్యమైనా ఇంటిని రంగులతో అలంకరించాలని కోరుకుంటాం. అభిమాన నాయకుడు, హీరోపై ప్రేమను చాటేలా, దేవుని తిరునాళ్ల సందర్భంగా భక్తిపారవశ్యం ఉప్పొంగేలా బ్యానర్లు కట్టాలని భావిస్తాం. ఈ పనులకు మనకు తొలుత గుర్తొచ్చేది పెయింటర్లే. ఈ వృత్తికి గతంలో బాగా డిమాండ్ ఉండేది. గుంటూరు జిల్లాలో 30వేల మందికిపైగానే పెయింటర్లు ఉన్నారు. గుంటూరు నగరంలో సుమారు 10వేల మందికిపైగా ఉండవచ్చని పెయింటర్ అసోసియేషన్ల అంచనా. అయితే, కొన్నేళ్లుగా వీరి వృత్తి సజావుగా సాగడం లేదు. అధునాతన యంత్రాలతో ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వస్తుండడంతో స్థానిక పెయింటర్ల ఉపాధికి గండి పడుతోంది. ఫలితంగా కుటుంబాలు పోషించుకోలేని దైన్యంలో కార్మికులు కొట్టుమిట్టాడుతున్నారు.

యాంత్రీకరణతోనే నష్టం

గతంలో సాధారణ ఇంటి నుంచి రెండు, మూడు అంతస్తుల భవనాలు, బహుళ వ్యాపార సముదాయాలకూ పెయింటర్లే రంగులు వేసేవారు. ఫలితంగా ఏడాదిలో ఆరు నెలల పాటు వీరికి పుష్కలంగా పని దొరికేది. అయితే, ఇప్పుడు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రంగుల నుంచి రకరకాల డిజైన్లను యంత్రాలే వేసేస్తున్నాయి. దీంతో పెయింటర్లకు పని దొరకడం లేదు. అరకొరగా



మూడు అంతస్తులపై ప్రమాదకరస్థితిలో రంగులు వేస్తున్న పెయింటర్

దొరికినా ఉదయం నుంచి చీకటి పడే వరకు రంగులు వేసినా రూ.600 నుంచి రూ. 700 కూలి రావడం గగనమైంది. అది కూడా ఏడాదిలో కేవలం రెండు, మూడు నెలలే పనులు ఉంటున్నాయి. ఇళ్ల నిర్మాణాల సమయంలో రంగులు వేసే పనులను తాపీ మేస్త్రీలే ఒప్పుకోవడం కూడా పెయింటర్ల జీవనాన్ని దెబ్బతీస్తోంది. దీనికి తోడు కంప్యూటర్‌పై ఫ్లెక్సీలు తయారు చేసే వ్యవస్థ రావటంతో బ్యానర్‌లపై బొమ్మలు, పెయింటింగ్‌లు వేసే పరిస్థితి దాదాపు కనుమరుగైంది.

ప్రత్యామ్నాయం వైపు..

పనులు లేకపోవడంతో పెయింటర్లు ప్రత్యామ్నాయ వృత్తులవైపు మళ్లుతున్నారు. కొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. రంగుల షాపులు, కిరాణా దుకాణాల్లో గుమాస్తాలుగా చేరుతున్నారు. పూల దుకాణాల్లో కూలీలుగా, బార్లలో వెయిటర్లుగా మారుతున్నారు.

వృత్తిని నమ్ముకుని బతుకుతున్నాం



ఎన్నోఏళ్ల నుంచి పెయింటింగ్ వృత్తిని నమ్ముకున్నాం. ఆధునిక యంత్రాల రంగప్రవేశంతో పనులు దొరకడం లేదు. ఆకలి కేకలు తప్పడం లేదు. ప్రభుత్వమే మమ్మలను ఆదుకోవాలి.

– షేక్ బాషా, పెయింటర్

పింఛన్లు, ఇళ్లు మంజూరు చేయాలి



ఈ వృత్తి ద్వారా కుటుంబ పోషణ భారమవుతోంది. ప్రభుత్వం పెద్ద మనసు చేసుకుని రుణాలు మంజూరు చేయాలి. ఈ డబ్బుతో యంత్రాలు కొనుక్కుని జీవనోపాధి పొందుతాం. పింఛన్లు, గృహాలు ఇచ్చి మా సంక్షేమానికి కృషి చేయాలి.

– ఎస్.రాము, పెయింటర్

ప్రమాదాలతో.. ఊయలూగుతూ..

బహుళ అంతస్తుల భవనాలకు రంగులు వేయడం ఓ సాహసమే. తాళ్ల సాయంతో గాలిలో ఊగుతూ రంగులు వేయాల్సి ఉంటుంది. ఇలా వేసే క్రమంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం మెండుగా ఉంది. రంగులు వేసే క్రమంలో కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. ప్రాణాలకు తెగించి పెయింటింగ్ వృత్తిని నమ్ముకున్న కుటుంబాలు ఇప్పుడు ఆకలికేకలతో ఆర్తనాదాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల కులవృత్తులకు విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ పథకంలో పెయింటర్లను చేర్చకపోవడంతో సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెయింటర్ల సంక్షేమానికి కృషి చేయాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

పీ-4 సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రభుత్వం చేపట్టిన పీ-4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం) సర్వే ముఖ్య ఉద్దేశం గ్రామాల్లో వెనుకబడిన వారిని గుర్తించి వారి అభ్యున్నతికి పనులు చేపట్టడమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పీ-4 విధానంపై స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్లతో అర్థ గణాంకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్వేలో ప్రజలంతా పాలుపంచుకొని మెజార్టీ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటులో సహకరించి, భూములు ఇచ్చిన రైతుల అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, దీనికి పీ-4 సర్వే ఉపయోగపడుతుందని కలెక్టర్ చెప్పారు. సర్వేపై స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్ ప్రజల్లో అవగాహన కల్పించి ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలని ఆయన కోరారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, స్టేక్ హోల్డర్స్, రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ సర్వే మంచిదని అభిప్రాయపడ్డారు. రెవెన్యూ జనరేషన్‌కు దోహదపడుతుందని తెలిపారు. రైతులతో పాటు అందరికీ అర్థమయ్యేలా తెలుగులో ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అర్థ గణాంకాధికారి శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ ఏడీ నవీన్‌కుమార్, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

రంజాన్ పండుగ మానవాళికి ఒక సందేశం

- జిల్లా పోలీసు కార్యాలయంలో ముస్లిం పోలీసులకు ఇఫ్తార్ విందు
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: పండుగ అనేది ఏ మతానికి సంబంధించినది అయినా దాని వెనుక ఒక సందేశం దాగి ఉంటుందని , ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి బోధిస్తుందని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రంజాన్ ఉపవాస దినాలను పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు శాఖ ప్రధాన కార్యాలయంలో ముస్లిం పోలీసులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి రోజాను విరమింపచేశారు. ఎస్పీ మాట్లాడుతూ రంజాన్ పండుగ ప్రాముఖ్యత, రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే విధానం గురించి తెలియజేశారు. చాంద్ర మానాన్ని అనుసరించే ఇస్లామియా క్యాలెండర్ తొమ్మిది నెల రంజాన్ అని, దీన్ని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారన్నారు. దీనికి ప్రధాన కారణం ఈ నెలలోనే దివ్య ఖురాన్ గ్రంథం అవతరించడమేనని ఆయన వివరించారు. ఈ మాసంలో ముఖ్యమైనవి రోజా, తరావి నమాజ్ అన్నారు.



ముస్లిం పోలీసులకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించినది రంజాన్ మాసంలోనే అవ్వడంతో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండి ఫిత్ర, జకాత్ దానధర్మాలు చేస్తుంటారని ఎస్పీ వివరించారు. అనంతరం ముస్లింలతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు పరిపాలన ఎస్పీ జేవీ.సంతోష్, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, జిల్లాలోని ముస్లిం పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

నరసరావుపేట టౌన్: చట్టాలపై విద్యార్థులకు కూడా అవగాహన అవసరమని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె. మధుస్వామి తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శుక్రవారం సెల్ఫ్ డిఫెన్స్, పోక్సో చట్టం తదితర అంశాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మధుస్వామి పోక్సో చట్టం గురించి క్షుణ్ణంగా వివరించారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధానాలను తెలియజేశారు. రోజువారి జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను వివరించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఎదురైనా సంకోచించకుండా డయల్ 100కు గానీ, స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థలో గానీ సంప్రదించాలని సూచించారు. విద్యార్థి దశలో కష్టపడి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. తొలుత పట్టణ ఎస్ఐ అరుణ మాట్లాడుతూ మహిళల భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచమని పేర్కొన్నారు. ప్రతి మహిళా ఫోన్లో నిక్షిప్తం



బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి మధుస్వామి

చేసుకొని, ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందాలని సూచించారు. తొలుత న్యాయమూర్తి హాస్టల్ వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్‌లు ఎన్. జయప్రద, జయలక్ష్మి, వసతి గృహ సిబ్బంది, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

మందుల దుకాణాలపై దాడులు



తనిఖీలు చేస్తున్న అధికారులు



స్వాధీనం చేసుకున్న మందుల నిల్వలు

- అనుమతులు లేకుండా గోదాం నిర్వహణ
- భారీగా అక్రమ ఔషధాలు స్వాధీనం
- దాడుల్లో పాల్గొన్న విజిలెన్స్, డ్రగ్స్ అధికారులు

నరసరావుపేటటౌన్: పట్టణంలోని పలు మందుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆపరేషన్ గరుడలో భాగంగా బరంపేటలోని భాగ్యశ్రీ మెడికల్ ఏజెన్సీ దుకాణంలో మొదట తనిఖీలు నిర్వహించారు. దుకాణానికి సంబంధించి రిక్షా సెంటర్ సమీపంలో ఇళ్ల మధ్య ఉన్న గోదాంలో సోదాలు చేపట్టారు. అనుమతులు లేకుండా భారీ స్థాయిలో మందులు నిల్వ ఉంచినట్లు విజిలెన్స్ బృందం గుర్తించింది. మందులను సీజ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఫిజీషియన్ శాంపిల్స్ ఉన్నట్లు సమాచారం. నరసరావుపేట రూరల్ సీఐ పి. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మంగమ్మ, పద్మ, విజిలెన్స్ ఏఈఈ శివన్నారాయణ, ఎఫ్ఆర్ఓ సైదులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్రో చూసొద్దాం రారండోయ్ !

- యువికా-25కు ఆహ్వానం
- ఈ నెల 23 వరకు రిజిస్ట్రేషన్ గడువు
- తొమ్మిదవ తరగతి విద్యార్థులకు అవకాశం

సత్తెనపల్లి/బెల్లంకొండ :భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను చూసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అంతరిక్ష పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగించడమే ప్రధాన ఉద్దేశం. స్పేస్ టెక్నాలజీ, సైన్స్ అప్లికేషన్లపై ప్రాథమిక జ్ఞానాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాకుండా వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఇస్రో యువికాను చేపడుతోంది. ఈ ఏడాది కూడా దేశ వ్యాప్తంగా తొమ్మిదవ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇందులో భాగంగా మేలో రెండు వారాలపాటు శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తారు.

శిక్షణ ఇచ్చే కేంద్రాలు ఇవే..

ఇస్రోను యువికాను దేశవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో నిర్వహిస్తోంది.

- తిరువనంతపురం (కేరళ) విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్
- తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట (ఆంధ్రప్రదేశ్) సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్
- డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్) ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్
- అహ్మదాబాద్ (గుజరాత్) స్పేస్ అప్లికేషన్ సెంటర్
- షిల్లాంగ్ (మేఘాలయ) నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్ సెంటర్
- బెంగళూర్ (కర్ణాటక) యూఆర్ రావు శాటిలైట్ సెంటర్
- హైదరాబాద్ (తెలంగాణ) నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్

వెయిటేజ్ ఇలా...

- 8వ తరగతిలో పొందిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు.
- జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం ఇస్తారు.
- స్పేస్, సైన్స్ క్లబ్‌లలో నమోదై ఉంటే ఐదు శాతం
- ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఐదు శాతం.
- గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారైతే 20 శాతం



ఆన్‌లైన్ ద్వారా ఎంపిక ప్రక్రియ

- యువికాలో భాగంగా 2025లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్ఆర్ఓ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులు పంపించాలి. ఈ నెల 23వ తేదీ వరకు గడువు ఉంది.
- ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల
- మే 18న ఆహ్వానం
- మే 19 నుంచి 30 వరకు శిక్షణ
- మే 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందిస్తారు.

విద్యార్థులకు అరుదైన అవకాశం



ఇస్రో కల్పించే అరుదైన అవకాశాన్ని విద్యార్థి దశలోనే పొందితే కచ్చితంగా దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదుగుతారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు, సైన్సు ఉపాధ్యాయులు దీన్ని బాధ్యతగా తీసుకొని రిజిస్ట్రేషన్ చేయించాలి.

–ఎస్.రాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి, పల్నాడు

శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశం



ప్రపంచంలోనే అగరాజ్యాలతో పోటీపడుతూ ఇస్రో ఎన్నో విజయవంతమైన రాకెట్ ప్రయోగ పరీక్షలను నిర్వహించింది. దేశ కీర్తిని ఆకాశానికి తీసుకెళ్లింది. యువికా పేరుతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయం. ఇస్రో శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది.

–ఏ.ఏ. మధు కుమార్, సైన్స్ ఉపాధ్యాయుడు, ఉప్పలపాడు

ప్రాధాన్యమిస్తారు.

ఎంపికైతే అన్నీ ఉచితం

యువికాకు ఎంపికైన విద్యార్థులకు ప్రయాణంతో పాటు వసతి, భోజన సదుపాయాలను అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఉచితంగానే అందిస్తుంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో రెండు వారాలపాటు (14 రోజులు) ఇస్రోకు చెందిన వివిధ రాష్ట్రాల్లోని స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారు. సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, నవగ్రహాల సముదాయం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం కలుగుతుంది.

గజేంద్ర మోక్షం అలంకారంలో నారసింహుడు



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా స్వామివారు శుక్రవారం గజేంద్ర మోక్షం అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన శేషగిరిరావు, కల్యాణిలు వ్యవహరించారు. ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన తాడికొండ తిరుమలరావు, తాడికొండ సాయికుమార్‌లు వ్యవహరించారు. శనివారం స్వామి పార్థసారథి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈవో రామకోటిరెడ్డి తెలిపారు.

ఆర్చరీ చాంపియన్‌షిప్ ప్రారంభం

ఏఎన్‌యూ(గుంటూరు): ఏపీ ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో నిర్వహిస్తున్న లెనిన్ ఓల్గా మెమోరియల్ అండర్-13, అండర్-10 ఆర్చరీ చాంపియన్‌షిప్ శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభకు ఏఎన్‌యూ వీసీ కె.గంగాధరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తులో విలువిద్యకు వర్సిటీ పూర్తి సహకారం అదిస్తుందన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి మాట్లాడుతూ క్రీడారంగ అభివృద్ధికి యూనివర్సిటీలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ ఆర్చరీ క్రీడను రానున్న రోజుల్లో ఏఎన్‌యూలో ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీ



పోటీలు ప్రారంభిస్తున్న వీసీ గంగాధరరావు

ఎస్ పాల్ కుమార్, నేషనల్ జడ్జి బి.వి.రమణ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి అండర్-13 విభాగంలో 700 మంది ఆర్చర్లు పాల్గొంటున్నారు. తొలిరోజు రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ర్యాంకింగ్ పోటీలు జరిగాయి.

క్లుప్తంగా

ఎట్టకేలకు కస్తల మైనర్‌కు సాగునీరు విడుదల

దొడ్లేరు ఆయకట్టు రైతుల్లో సంతోషం



క్రోసూరు: నాగార్జున సాగర్ కెనాల్స్ అధికారులు ఐదు రోజుల వారాబందీ పద్ధతిలో చింతపల్లి మేజరు ద్వారా కస్తల మైనర్‌కు నీళ్ల విడుదల చేశారు. మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు దాళ్వాలో వరి సాగు చేస్తున్నారు. గత పది రోజులుగా నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయని బుధవారం గ్రామంలో ధర్నా చేశారు. దీంతో కెనాల్స్ ఏఈ బండి శ్రీనివాసరావు గురువారం నీళ్ల విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కాలువలకు నీళ్ల విడుదల చేశారు. శుక్రవారం కస్తల మైనర్ కాలువకు చేరుకున్నాయి. ఐదు రోజుల పాటు విడుదల చేస్తామని, ఆ తరువాత ఎర్రబాలెం మేజరుకు నీళ్ల విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



సాగర్‌బాబు మృతదేహం

పిడుగురాళ్ల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కరాలపాడు వెళ్లే నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద శుక్రవారం జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాల మేరకు...దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామానికి చెందిన మందా సాగర్‌బాబు(35) భార్య మరియకుమారితో కలిసి ద్విచక్ర వాహనంపై కరాలపాడు వస్తున్నారు. నీలంపాటి అమ్మవారి గుడి నుంచి వేగంగా వస్తున్న కారు కరాలపాడు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సాగర్‌బాబుకు తీవ్రం గానూ, భార్య మరియకుమారికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఇద్దరిని పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సాగర్‌బాబు అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు మరియకుమారి కాలికి గాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కాల్వలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వేటపాలెం: స్ట్రయిట్ కట్ కాల్వలో చెక్ వాల్ దగ్గరలో నీటిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి సుమారు 58 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. ఒంటిపై ఎర్రగీతల బనియన్ ధరించి ఉన్నాడు. మృతుడు దగ్గరలోని చేపలు పట్టుకొనే యానాదుల కాలనీకి చెందిన వాడిగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

కూటమి ప్రభుత్వంలో రాజకీయ వేధింపులు

- సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ
- ఆపకపోతే పోరాటం
- అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతికి పరామర్శ



సత్తెనపల్లిలో చికిత్స పొందుతున్న జ్యోతిని పరామర్శిస్తున్న సుబ్బారావమ్మ తదితరులు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఇతర స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, వీటిని ఆపకపోతే పోరాటానికి సన్నద్ధమవుతామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ పేర్కొన్నారు. సత్తెనపల్లిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్త జి.జ్యోతిని శుక్రవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో రాజకీయ వేధింపులను తట్టుకోలేక 60 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు రాజీనామా చేశారని, కొంత మంది ఊర్లు వదిలి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరిగా ఫుడ్ ఇవ్వడం లేదని, కోడిగుడ్లు, బాలామృతం సక్రమంగా సరఫరా చేయడం లేదని తెలిపారు. కానీ అంగన్‌వాడీ కార్యకర్తలపై పిల్లలకు ఫుడ్ సరిగా ఇవ్వడం లేదనే పేరుతో వేధింపులకు పాల్పడడం సరికాదని ఖండించారు. అంగన్‌వాడీ కార్యకర్త జి. జ్యోతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి కారకులైన ఐసీపీఎస్ పీడీ ఉమాదేవి, నోడల్ ఆఫీసర్ అరుణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)అధ్యక్ష, కార్యదర్శులు మెటిల్లాదేవి, గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మెకు దిగినప్పుడు కూటమి నాయకులు అంగన్‌వాడీ దీక్షా శిబిరాల వద్దకు వచ్చి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని చెప్పారన్నారు. కూటమి నాయకులు ఆరోజు ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయకపోగా అంగన్‌వాడీలపై వేధింపులకు పాల్పడడం దుర్మార్గమని ఖండించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జి. ఉమశ్రీ, పెండ్యాల మహేష్, డి. విమల, జి. రజిని, కె. సుధ, జె. రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదం నేపథ్యంలో ఇంటిపై దాడి



ఇంటిలో గృహోపకరణాల ధ్వంసం చేసిన ఎమ్మెల్యే అనుచరులు



ఇంటిని ధ్వంసం చేసిన దృశ్యం



ఇంటిపై దాడిలో భాస్కర్ అనుచరులు

- ఇల్లు, ఇంట్లో గృహోపకరణాలు ధ్వంసం
- నిందితులు అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులుగా గుర్తింపు !
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): స్థల వివాదం నేపథ్యంలో కొందరు దాడి చేసి ఇంటిని, గృహోపకరణాలను ధ్వంసం చేశారు. ఈ ఘటన శుక్రవారం గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం శాంతినగర్ 4వ లైన్‌లో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. శాంతీనగర్‌లోని ఇంటిలో జాజుల ఏడుకొండలు, భార్య తిరుపతమ్మ ఉంటారు. వీరికి నలుగురు సంతానం. అదే ఇంట్లో అతని తమ్ముడు జాజుల బాల నరసింహారావు, అతని భార్య నాగమణి కూడా నివాసం ఉంటారు. ఏడుకొండలు, ఫైనాన్స్, గొర్రెల వ్యాపారం చేస్తుంటాడు. 2021లో శాంతీనగర్ 4వ లైన్‌లో 216 గజాల స్థలం శ్రీనివాసరావుపేటకు చెందిన కాశీవిశ్వనాథ్ కుమారుడు రవీంద్రబాబు వద్ద ఏడుకొండలు కొన్నాడు. రవీంద్రబాబుకు శ్రీనివాసరావుపేటకు చెందిన పెడమల్లు భాస్కర్‌ల మధ్య కోర్టులో స్థల వివాదం నడుస్తోంది. 2018లో రవీంద్రబాబుపై భాస్కర్ కోర్టులో గెలిచారు. 2021లో స్థలాన్ని రవీంద్రబాబు వద్ద నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని ఇల్లు ఖాళీ చేయాలంటూ, కోర్టులో తమకు పూర్తి అధికారాలు ఉన్నాయని మల్లు భాస్కర్ వేధింపులకు గురి చేయడం ప్రారంభించాడు. శుక్రవారం ఏడుకొండలు, భార్య తిరుపతమ్మ బయటకు వెళ్లగా ఇంట్లో ఏడుకొండలు తమ్ముడు బాలనరసింహారావు, అతని భార్య నాగమణి ఉన్నారు. పెడమల్లు భాస్కర్ ఆయన సతీమణి భూలక్ష్మి పల్నాడు జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనుచరులు అయిన ఆలపాటి నాని, అశోక్‌లతోపాటు సుమారు 30 మందితో ఇంటిపైకి వచ్చి దాడి చేశారు. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు ధ్వంసం చేశారు. బాధితులు 112కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నగరంపాలెం పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. అందరినీ అక్కడి నుంచి తరిమేసి పెద్దమల్లు భాస్కర్‌ని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బాధితులు తేరుకొని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కుని ఫిర్యాదు చేశారు.

24న శాంతియుత నిరసన

గుంటూరు మెడికల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో దీర్ఘకాలంగా ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం మార్చి 24న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శాంతియుత నిరసన తెలియజేయనున్నట్లు ఎన్టీఆర్ వైద్య మిత్ర అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త (డీసీ) ఆఫీసుల వద్ద విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈనెల 27న మంగళగిరిలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఆఫీస్ వద్ద గాంధేయ పద్ధతిలో శాంతియుత నిరసన తెలుపుతామని వెల్లడించారు. ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిద్దాం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి



తెనాలి అర్బన్: ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో నరేంద్రదేవ్ కాలనీలో శుక్రవారం దోమలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె దోమల నివారణ గురించి వివరించారు. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ జ్వర లక్షణాలు ఉంటే వెంటనే చికిత్స పొందాలని సూచించారు.

అరకొర వేతనాలతో 'ఆశా'ల అవస్థలు

- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి
- ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కమిటీ డిమాండ్
- డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేసిన నాయకులు



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: వైద్య ఆరోగ్య శాఖలో విశేష సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు, పెన్షన్ కల్పించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.చంద్రకళ, డి.శివకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎండీహెచ్‌వో డాక్టర్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న ఆశా వర్కర్లని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని కోరారు. దీర్ఘకాలంగా పనిచేస్తూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో అర్ధంతరంగా మృతి చెందిన ఆశాల కుటుంబాలను ఆదుకోవాలని విన్నవించారు. గ్రూపు ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించి మట్టి ఖర్చులు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్‌హెచ్‌ఎం స్కీం ఏర్పడి 20 ఏళ్లు గడుస్తున్నప్పటికీ కనీస వేతనాలు చెల్లించడంలేదని తెలిపారు. గడిచిన ఏడేళ్లలో ఆశాలకు వేతనాన్ని వెయ్యి రూపాయలు మాత్రమే పెంచి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, పారితోషకంలేని పనులు చేయించరాదని కోరారు. ఆశాలకు ఆస్పత్రులలో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, ప్రసూతి సెలవుల అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనంతో కూడిన సాధారణ, ఆరు నెలల మెడికల్ సెలవులు ఇవ్వాలని కోరారు. ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే యూనియన్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని శివకుమారి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రత్నకుమారి, జిల్లా ఉపాధ్యక్షులు పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

24న రవాణా రంగ కార్మికుల 'చలో పార్లమెంట్'



చలో పార్లమెంట్ కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

లక్ష్మీపురం: ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 24న 'చలో పార్లమెంట్' చేపట్టినట్లు సంఘ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు వెల్లడించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని ఆటో స్టాండ్‌ల వద్ద పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత రవాణా రంగంపై పెద్దఎత్తున దాడి ప్రారంభించిందని ఆరోపించారు. భారతీయ న్యాయ సంహిత 2023 సెక్షన్ 106(1), (2)ను తీసుకురావడం చిన్న చిన్న తప్పిదాలకు కూడా డ్రైవర్లలను బాధ్యులు చేయటం, భారీ శిక్షలు, జరిమానాలు విధించడం వంటి చర్యలు రవాణా రంగాన్ని నిర్వీర్యం చేయడమేనని ధ్వజమెత్తారు. వాహనా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం కార్మికులపై భారాన్ని మోపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.. రాష్ట్రంలో భారీ పెనాల్టీలు విధిస్తూ తీసుకొచ్చిన జీఓ నంబర్ 21ను తక్షణమే రద్దు చేయాలని లక్ష్మణరావు డిమాండ్ చేశారు. నగర ఆటో డ్రైవర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కే శ్రీనివాసరావు, వెంకట్, జానీ పాల్గొన్నారు.

పత్తి ఉత్పత్తిని పెంచేందుకు కృషి జరగాలి



కార్యక్రమంలో పాల్గొన్న విశ్వవిద్యాలయం అధికారులు, ఐసీఏఆర్, సీఐసీఆర్ శాస్త్రవేత్తలు

పత్తిపంట అఖిల భారత వార్షిక సమూహ సమావేశంలో వక్తలు

గుంటూరు రూరల్: దేశంలో పత్తి పంట ఉత్పత్తి పెంచేలా కృషి జరగాలని వక్తలు అభిప్రాయపడ్డారు. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఎన్జీ రంగా వర్సిటీలో ఐసీఏఆర్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ (ఐసీఏఆర్- సీఐసీఆర్), వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా పత్తి వార్షిక సమూహ సమావేశం (ఏజీఎమ్) -2025ను శుక్రవారం ప్రారంభించారు. మూడురోజులపాటు జరిగే ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ శాస్త్రవేత్తలు, విత్తన కంపెనీల ప్రతినిధులు ముఖ్య భాగస్వాములు హాజరయ్యారు. పత్తి ఉత్పత్తి పెంపుపై చర్చించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎన్జీరంగా వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. ఆమె పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడంలో బీటీ పత్తి కీలకపాత్ర పోషించినట్టు వివరించారు. వర్సిటీ విడుదల చేసిన నరసింహ (ఎన్ఏ-1325) పత్తి రకం విజయ ప్రస్థానం గురించి చెప్పారు. పత్తి రైతుల నికర ఆదాయాన్ని గణనీయంగా పెంచడంలో ఇది దోహదపడిందని తెలిపారు. డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో పత్తి ఉత్పత్తి పెంపునకు కృషి జరగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్, సీఐసీఆర్ నాగపూర్ సంచాలకులు డాక్టర్ వై.జి. ప్రసాద్, ఐసీఏఆర్, సీఐఆర్‌సీఓటీ ముంబై డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే శుక్లా, ఐసీఏఆర్ పంట శాస్త్ర విభాగం సహాయ డైరెక్టర్ జనరల్ (వాణిజ్య పంటలు) డాక్టర్ ప్రశాంతకుమార్‌దాస్, పత్తి ప్రాజెక్ట్ పర్యవేక్షణ, సలహా కమిటీ చైర్మన్ డాక్టర్ సిడి మాయీ తదితరులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఆచార్య కృపాచారికి పరిశోధక గురు పురస్కారం



కృపాచారిని పురస్కారంతో సత్కరించిన ఆచార్య ఇనాక్

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పరిశోధక గురువుగా చేసిన సేవలు ప్రశంసనీయమని ప్రముఖ రచయిత, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. స్థానిక చెంచుపేట డొంకరోడ్డులోని ఆచార్య కృపాచారి నివాసానికి శుక్రవారం ఆచార్య ఇనాక్ వచ్చారు. పరిశోధక గురు పేరుతో కొలకలూరి పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ తాము ఏటా ప్రదానం చేస్తున్న కొలకలూరి పురస్కారాలను రచయితలతోపాటు పరిశోధకులు, పరిశోధక గురువుకు కూడా అందజేస్తున్నామని గుర్తుచేశారు. ఈ ఏడాది ప్రకటించిన అవార్డుల్లో పరిశోధక గురు అవార్డుకు కృపాచారిని ఎంపిక చేశామని తెలిపారు. అయితే ఆరోగ్య కారణాలతో హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ సభకు ఆయన హాజరుకాలేకపోయారని చెప్పారు. తానే స్వయంగా తెనాలి వచ్చి కృపాచారికి ఈ పురస్కారాన్ని అందజేసినట్టు ఆచార్య ఇనాక్ వివరించారు. కృపాచారి పర్యవేక్షణలో 75 మంది పీహెచ్‌డీలు, 68 మంది ఎంఫిల్ చేసినట్టు గుర్తుచేశారు. పలు విశ్వవిద్యాలయాకు 45 పాఠ్యగ్రంథాలను అందించారనీ, పలు అవార్డులను స్వీకరించారని గుర్తుచేశారు. పురస్కారం స్వీకరించటంపై కృపాచారి సంతోషాన్ని ప్రకటించారు.

పాఠశాల బస్సును ఢీకొట్టిన లారీ

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- తొమ్మిది మందికి స్వల్పగాయాలు



ప్రమాదానికి గురైన పాఠశాల బస్సు



గాయపడిన విద్యార్థులు

అద్దంకి: ఆగి ఉన్న ప్రైవేటు పాఠశాల బస్సును లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో తొమ్మిది మంది విద్యార్థులు స్వల్ప గాయాలతో బయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని గోపాలపురంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రావిటీ పాఠశాలకు చెందిన బస్సు బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి వైపు నుంచి విద్యార్థులను ఎక్కించుకుని అద్దంకి మండలంలోని గోపాలపురం గ్రామ సమీపంలోకి వచ్చింది. ఈ క్రమంలో వెనుకగా వచ్చిన లారీ ఆగి ఉన్న బస్సును ఢీకొట్టి ముందుకు వెళ్లింది. బస్సు కుదుపునకు గురవడంతో అందులోని తొమ్మిది మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహన సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స చేశారు.

ముగిసిన ఏఎన్‌యూ ఇంటర్ కాలేజియేట్ బేస్‌బాల్ మెన్ టోర్నీ



విన్నర్ ట్రోఫీని అందుకున్న ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల జట్టుతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడా స్ఫూర్తి జీవితంలో ఉన్నస్థాయికి చేరుస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల బేస్ బాల్ (మెన్) టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి, విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రన్నర్ ట్రోఫీని ఏఎన్‌యూ ఫిజికల్ కళాశాల జట్టు సాధించింది. తృతీయ స్థానంలో ఎంఏఎం పీజీ కాలేజీ, నాలుగో స్థానంలో సీఆర్ కాలేజీ జట్లు నిలిచి ట్రోఫీలను అందుకున్నాయి. టోర్నమెంట్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులతో ఏఎన్‌యూ సాఫ్ట్ బాల్ (మెన్) జట్టును సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ పి. గౌరీశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ, ఏఎన్‌యూ టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ సూర్యనారాయణ, సెలెక్షన్ కమిటీ మెంబర్స్ డాక్టర్ పీ శ్రీనివాస్, డాక్టర్ ఎం. బుచ్చిబాబు, డాక్టర్ రాజామెరిసిన్ బాబు, జె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.341కోట్లు మంజూరు

నెహ్రూనగర్: ఎస్సీల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున స్వయం ఉపాధి పథకాలు అమలు చేయడం జరుగుతుందని, ఎస్సీ కార్పొరేషన్‌కు రూ. 341 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు రాష్ట్ర మాదిగ వెల్ఫేర్, కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర మాదిగ వెల్ఫేర్, కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయితో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సబ్సిడీ రుణాలకు ప్రజల నుంచి ఏ విధంగా అర్జీలు తీసుకుని పరిష్కరిస్తున్నారో చూడడానికి ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చినట్లు చెప్పారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 15 ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లలోని 295 షాపులకు మరమ్మతులు చేసేందుకు రూ.121.75 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఉన్నతి పథకంలో రూ. 2 కోట్ల 83 లక్షలు మంజూరు చేసినట్లు ఆమె వెల్లడించారు.

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి

బాపట్ల: ఆధునిక సమాజంలో చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడంలో పెరిగిందని, వాటిలోని పోషక విలువలే ఇందుకు కారణం అని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూనరాణి అన్నారు. వ్యవసాయ కళాశాల జన్యుశాస్త్రం -వృక్ష ప్రజనన విభాగం ఆధ్వర్యంలో 'సేంద్రియ చిరుధాన్యాల సాగు, సస్యరక్షణ, ఆరోగ్య ప్రయోజనాలు, విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. చిరుధాన్యాలపై ప్రచారం ఎక్కువ జరగాలని ప్రసూనరాణి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ మండల శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరుధాన్యాలను తినడం వలన కండరాల శక్తి వృద్ధి పొందుతుందన్నారు. జన్యు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ లాల్ అహ్మద్ మహమ్మద్ మాట్లాడుతూ చిరుధాన్యాలు అమ్మవంటివని తెలిపారు.